సూరారం పీఎస్ పరిధిలో ఇద్దరు అదృశ్యం

గాజులరామారం మే 4(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనలో ఇద్దరు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూరా రం రాజీవ్‌గాంధీ నగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి తుంగ అంజయ్య(45) నివాసం ఉంటున్నాడు. ఈనెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అంజయ్య తిరిగి రాలేదు. దీంతో భార్య హైమావతి చుట్టుపక్కల, కుటుంబసభ్యుల దగ్గర వెతికినా అంజయ్య ఆచూకీ లభించలేదు. భార్య శనివారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.మరో సంఘటనలో.. సూరారం న్యూ శివాలయం నగర్‌లో నివాసముండే పి.రాజు కుమార్తె అనూష(19), కొంతకాలంగా సూరారం లోని మస్తాన్ బిల్డింగులో పని చేస్తుంది. ఈనెల రెండో తేదీన పనిచేసే బిల్డింగుల్లో మూడు రోజులు పని ఉందని వెళ్లి తిరిగిరాలేదు. తమ కుమార్తె తిరిగి రాకపోవడంతో శనివారం తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్టు

20 బైక్‌లు స్వాధీనం

మియాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగలను మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 20 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఏసీపీ నర్సింహరావు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన నాగరాజు, సాకేత్ ఇళ్లముందు పార్కు చేసిన ద్విచక్రవాహనాలను గుట్టుచప్పుడు కాకుండా దొంగిలిస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మియాపూర్‌లో వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన నాగరాజు, సాకేత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వారిచేసిన దొంగతనాలు అంగీకరించారు. వారి నుంచి 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా వీరిపై మియాపూర్ పీఎస్ పరిధిలో 9 కేసులు, ఇతర పోలీస్‌స్టేషన్ల పరిధిలో 11 కేసులు ఉన్నట్లు తెలిపారు.

సమన్వయ సమావేశం



బ్లాస్టింగ్ యూనిట్ల ప్రతినిధులతో శనివారం గచ్చిబౌలి కమిషనరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డి జోయల్ డేవిస్. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, అగ్నిమాపక శాఖ, క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, మే 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలబడి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయ న మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేలా అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీకాంత్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సప్తగిరికాలనీలోని పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

● చేవెళ్లగడ్డపై హ్యాట్రిక్ విజయం ఖాయం

మియాపూర్: చేవెళ్లగడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసి హ్యాట్రిక్ విజయం నమోదు చేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి హఫీజ్‌పేట ఆదిత్యనగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ చెప్పే మోసపూరిత వాగ్దానాలు ప్రజలు నమ్మొద్దన్నారు.

● కార్పొరేటర్ ఇంటింటి ప్రచారం

కారు గుర్తుకు ఓటువేసి బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మియాపూర్ మక్తామహబూబ్‌పేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

● టీఎన్‌జీవో కాలనీలో..

రాయదుర్గం: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా శనివారం మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పార్టీ నాయకులతో కలిసి గచ్చిబౌలి టీఎన్‌జీవోకాలనీలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



మక్తామహబూబ్‌పేటలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్



టీఎన్‌జీవోకాలనీలో కాసాని కోసం ప్రచారం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

మెరీడియన్ స్కూల్‌తో గూడీబ్యాగ్ స్టార్టప్ సంస్థ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో గూడీబ్యాగ్ సీఈవో అభిషేక్ అగర్వాల్, మెరీడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ నిషిరాణ

రాయదుర్గం, మే 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాసిక్ వ్యర్థాలను తొలగించేందుకు కృషి చేస్తున్న గూడీబ్యాగ్ స్టార్టప్ సంస్థ బంజారాహిల్స్‌లోని మెరీడియన్ స్కూల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం టీహబ్‌లో నిర్వహించిన ఒప్పంద కార్యక్రమంలో గూడీబ్యాగ్ వ్యవస్థాపకుడు, సీఈవో అభిషేక్ అగర్వాల్, మెరీడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ నిషిరాణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కార్బన్ పదార్థాల వినియోగాన్ని తగ్గించేందుకు గూడీబ్యాగ్ స్టార్టప్ సంస్థ గత సంవత్సర కాలంగా కృషి చేస్తోంది. ఈ కార్యక్రమానికి విశేషంగా కృషి చేసిన వారిని ఈ సందర్భంగా గూడీబ్యాగ్ స్టార్టప్ సంస్థ అవార్డుల మొదటి ఎడిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఈవో అభిషేక్ అగర్వాల్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. గూడీబ్యాగ్ మెరీడియన్ స్కూల్ మధ్య అవగాహన ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తామని పేర్కొన్నారు.

శేరిలింగంపల్లిలో హోం ఓటింగ్ ప్రారంభం

● పరిశీలించిన ఏఆర్‌ఓ స్నేహ షబరీష్

గచ్చిబౌలి, మే 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా 85 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్ద ఓటు వేసే ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఆదివారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని నియోజకవర్గ ఏఆర్‌ఓ స్నేహ శబరీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఓటింగ్ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 5వ తేదీ వరకూ హోంఓటింగ్ కొనసాగుతుందని, ఇందుకు సంబంధించి ఏనిమిది బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 85 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు అత్యవసర సేవలకు సంబంధించిన వారు హోం ఓటింగ్ ద్వారా ఇంటి వద్ద ఓటు వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జోనల్ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న పోస్టల్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు.

● కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో ఫారం-12డికి (ఇంటి వద్దే ఓటు) దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు హోం ఓటింగ్‌ను ఎన్నికల అధికారులు శనివారం ప్రారంభించారు. నియోజకవర్గంలో మొత్తం 280 మంది ఓటర్లు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా దాని కోసం 5 ప్రత్యేక బృందాలను కేటాయించి ప్రక్రియను కొనసాగిస్తున్నారు. తొలి రోజు 280 మందిలో 165 మంది ఓటర్లు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఎవరైనా మిగిలి ఉంటే మే 8వ తేదీన చివరి అవకాశం ఉంటుందని నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, డీసీ ఎల్‌పీ. మల్లయ్య తెలిపారు.



హోం ఓటింగ్ ద్వారా ఓటు వేయిస్తున్న ప్రత్యేక బృందం

రంజిత్‌రెడ్డి గెలుపుతోనే అభివృద్ధి



ఇంటింటి ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి కుటుంబసభ్యులు

గచ్చిబౌలి, మే 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా శనివారం శేరిలింగంపల్లి గోపీనగర్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు.

● ఎంఐజీకాలనీలో ఇంటింటి ప్రచారం

భెల్‌కాలనీ, మే4 (ఆంధ్రజ్యోతి): రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుటుంబసభ్యులు భారతీనగర్ డివిజన్ పరిధిలోని భెల్ ఎంఐజీకాలనీలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు గిరి ఆధ్వర్యంలో ప్రధాన రోడ్ల వెంట ర్యాలీ నిర్వహించి ప్రజలకు కరపత్రాలు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలను కాలనీవాసులకు వివరిస్తూ ప్రచారంలో ముందుకు సాగారు. కాంగ్రెస్‌తోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు బాలయ్య, సుబ్రహ్మణ్యం, థామస్, భాస్కర్, సావిత్రి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

● తండ్రికి మద్దతుగా తనయుడి ప్రచారం

సరూర్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్ధతుగా ఆయన తనయుడు రాజ్ ఆర్యన్‌రెడ్డి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాతారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి, ఈ ఎన్నికల్లో తన తండ్రి రంజిత్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చేవెళ్లలో రంజిత్‌రెడ్డి గెలిస్తేనే మహేశ్వరం నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పారిజాతారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అమృతానాయుడు, గట్టు బాలకృష్ణ, సామ వరుణ్‌రెడ్డి, రంజిత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండల పరిధిలోని మీర్జగూడ, బస్తేపూర్, దామరిగిద్ద తదితర గ్రామాల్లో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అవుతాయని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రంజిత్‌రెడ్డి విజయం సాధిస్తే చేవెళ్ల అభివృద్ధి పరంగా రుపురేఖలు మారుతాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్‌లు భీమయ్య, ప్రభాకర్, ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటేశంగుప్తా, మధుసూదన్‌గుప్తా, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ గంగి యాదయ్య, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.



గోపీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జగదీశ్వర్‌గౌడ్



బడంగ్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న రాజ్‌ఆర్యన్‌రెడ్డి, పారిజాతారెడ్డి

గల్లీలో ఎవరున్నా.. ఢిల్లీలో మోదీ ప్రధానిగా ఉండాలి



ఈటల రాజేందర్‌కు మంగళహారతి ఇస్తున్న మహిళ



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కూకట్‌పల్లి జోన్‌బృందం, మే 4(ఆంధ్రజ్యోతి): గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీ ప్రధానిగా ఉండాలని మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్‌లోని అయోధ్య నగర్, కుత్బుల్లాపూర్, భూమిరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. ప్రజలు మంగళహారతులతో ఈటల రాజేందర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. సైనికులకు మోదీ అండగా నిలబడి దేశ విదేశాల్లో వారి కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించారన్నారు. మన నేవీ ఉద్యోగులకు పరాయి దేశంలో ఉరిశిక్ష పడితే, ఆ దేశాల అధ్యక్షులతో మాట్లాడి దాన్ని రద్దు చేయించారన్నారు. కొంపల్లి వైపు మెట్రోరైలు తీసుకురావాలనే ఉద్దేశంతో ఉన్నామని, మల్కాజిగిరిలో ఎలాంటి అభివృద్ధి జరగాలన్నా మేము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, భరత్‌సింహారెడ్డి, బక్క శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గిరివర్ధన్‌రెడ్డి, శేఖర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, పులి బలరామ్ పాల్గొన్నారు.

● బౌరంపేట, నిజాంపేట్‌లో ప్రచారం

ఈటల రాజేందర్‌కు మద్దతుగా జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరాచారి, కౌన్సిలర్ కృష్ణారెడ్డి, మున్సిపల్ ప్రధాని కార్యదర్శి నర్సింహచారిలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. నిజాంపేట్ 1వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రణీత్ గ్రేటెడ్ కమ్యూనిటీ సర్కిల్‌లో ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విష్ణున్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

● సుచిత్రలో ఎమర్జింగ్ భారత్ కార్యక్రమంలో ఈటల

సుచిత్రలో నిర్వహించిన కార్యక్రమంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచంలో తలెత్తుకునే విధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేశారన్నారు. చరిత్రలను మార్చే శక్తి ప్రజలకు మాత్రమే ఉంటుందని, గ్రామ సర్పంచులు మొదలుకొని దేశ ప్రధానమంత్రి వరకు ప్రజలే తమ ఓటు హక్కు ద్వారా ఎన్నుకుంటారన్నారు.

● కాంగ్రెస్, బీఆర్ఎస్ వల్ల ఒరిగిందేమీ లేదు

కుత్బుల్లాపూర్: దేశాభివృద్ధి జరగాలన్నా, ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలన్నా, మౌలిక వసతులు సమకూరాలన్నా అది కేవలం బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి వెంకటేశ్వరనగర్, మోదీ బిల్డర్స్‌లో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన శనివారం పాల్గొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏదీ నెరవేరలేదన్నారు. గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీ ఉండాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, భరత్‌సింహారెడ్డి, వాసు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

● సీఎం హామీలను నమ్మొద్దు

కూకట్‌పల్లి: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని ఈటల రాజేందర్ అన్నారు. శనివారం రాత్రి మూసాపేట్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం అధికారంలో లేనపుడు ఒకలా మాట్లాడారని, అధికారంలోకి వచ్చాక ఇష్టం వచ్చిన హామీలు ఇస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.



మూసాపేట్‌లో ఈటల రాజేందర్ రోడ్ షోకు హాజరైన జనం

ఈవీఎంలను పకడ్బందీగా సిద్ధం చేయాలి



ఈవీఎంలను పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్, ఆర్వో గౌతం

కుత్బుల్లాపూర్: మే 13న జరిగే ఎన్నికలకు ఈవీఎంలలో ఎటువంటి అవకతవకలకు వీలులేకుండా పకడ్బందీగా సిద్ధం (కమిషనింగ్) చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, ఆర్వోగౌతంపోట్రు సూచించారు. ఈమేరకు అల్వాల్ లయోలా కాలేజీలోని డీఆర్‌సీ కేంద్రంలో కుత్బుల్లాపూర్ నియోజవర్గానికి చెందిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను వారు వేర్వేరుగా శనివారం పరిశీలించారు. కమిషనింగ్ ప్రక్రియ వివరాలను నియోజకవర్గ ఏఆర్వో పులి సైదులును అడిగి తెలుసుకొన్నారు. బ్యాలెట్ యూనిట్‌లో బ్యాలెట్ పేపర్‌ను పొందుపరిచి ఎటువంటి పొరపాట్లు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 740 కంట్రోల్ యూనిట్లు, 1,480 బ్యాలెట్ యూనిట్లు, 828 వీవీపీఏటీలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమంలో ఈఆర్వో వి.నర్సింహ, ఏఈఆర్వోలు ఉదయ్‌కుమార్, పూల్‌సింగ్, సూపరింటెండెంట్ గిరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

భెల్‌కాలనీ, మే4 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైయిందని ప్రిన్సిపాల్ నిఖిత్ అంజూం తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ, బీఎస్సీ, బీజెడ్‌సీ, కంప్యూటర్‌లో కోర్సుల్లో అడ్మిషన్‌ల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మే 6వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక సభ్యులు

● బీసీ రిజర్వేషన్లు పెంచుతామనడం సంతోషం

దుండిగల్: కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో బీసీ కుల జనగణన చేస్తామని, బీసీ రిజర్వేషన్లు పెంచుతామని, వారి మేనిఫెస్టోలో పెట్టినందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు రాష్ట్ర బీసీ ఐక్యవేదిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కొంపల్లి బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు ఆరే మహేందర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం 23 శాతం ఉన్న బీసీ రిజర్వేషనలను 42 శాతం చేస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ అధ్యక్షుడు రాజేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్‌ఆర్‌ఐటీ వార్షికోత్సవం

దుండిగల్, మే 4 (ఆంధ్రజ్యోతి): దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్ ఐటీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హెక్సావేర్ టెక్నాలజీలో కేరీర్, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ హెడ్ సౌగతాసేన్, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మర్రి శ్రేయరెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి, ఎయిమ్స్ డైరెక్టర్ మర్రి ధీరేన్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, అరుంధతి డీన్ డా.ఎన్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్నిస్ విజేత రామోజు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏఐటీఏ నేషనల్ సిరీస్ అండర్-14 బాలుర విభాగంలో ఎ.శ్రీరామోజు విజేతగా నిలిచాడు. గత నెల 29వ తేదీ నుంచి జరుగుతున్న ఈ పోటీలు శనివారం ముగిశాయి. సింగిల్స్ ఫైనల్లో శ్రీరామోజు 3-6, 6-0, 6-4తో అర్యన్‌పై నెగ్గాడు. బాలికల సింగిల్స్ ఫైనల్లో సృష్టి కిరణ్ 6-0, 7-5తో సుభాణిపై గెలిచింది. బాలుర డబుల్స్‌లో శ్రీరామోజు-మీర్ ఫజల్ అలీ 4-6, 6-3, 10-5తో ఆర్యన్-లక్ష్య వర్ధన్‌పై నెగ్గగా, బాలికల డబుల్స్‌లో సృష్టి-పద్మ జోడీ విజేతగా నిలిచింది.

రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపితే కఠిన చర్యలు

దుండిగల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రశాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపే ప్రాంతాలైన బాచుపల్లిలోని కోకాకోలా కంపెనీ వద్ద 17 ద్విచక్ర వాహనాలను పట్టుకొని బాచుపల్లి పీఎస్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. అలాగే మియాపూర్‌లోని సంతోష్ దాబా వద్ద 9 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పట్టుకొని మియాపూర్ పీఎస్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఎస్‌ఐలు సుశాష్, మల్లేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, పక్కన మాజీమంత్రి కేటీఆర్, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కూకట్‌పల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ సున్నంచెరువు పార్కులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనుల్లో 90 శాతం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసినవేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబీహాబేగం, గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, నూర్ పాల్గొన్నారు.

● బాలాజీనగర్‌లో..

బాలాజీనగర్ డివిజన్ పరిధి కేపీహెచ్‌బీకాలనీలోని 2, 3వ రోడ్లలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీకాలనీలో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు సహకరించాలని కోరారు. బాబురావు, అరుణశెట్టి, లక్ష్మీరాజ్యం, పవన్‌కుమార్, వంశీ పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ షాపూర్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ రాగిడి లక్ష్మారెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు. అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, కార్పొరేటర్‌లు మంత్రి సత్యనారాయణ, మాజీకార్పొరేటర్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్కులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు